బాలుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన దాసరి రాజు, ఖేజియా కుమారుడు తరుణ్ కుమార్ ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే వెంటనే స్పందించి జరిగిన ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలన్న ఉద్దేశంతో రూ.20వేలు ఆర్థిక సాయాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా అందించారు. రానున్న రోజుల్లో ఈ కుటుంబానికి అండగా నిలుస్తానన్నారు. దుగ్గిరాల జడ్పీటిసి సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచ్ ఉన్నం ఝాన్సి, ఉప సర్పంచ్ ఎం.నాగలక్ష్మి, ఎంపీటీసీ షేక్ సుభానీ, వైసీపీ నాయకులు దాసరి వీరయ్య, గుమ్మడి తంబిరాజు, దూళ్ళ వీర వసంతరావు, గుడిపూడి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు

విశాలాంధ్ర-తెనాలి : ఇంటర్మీడియెట్‌లో 950 మార్కులకు పైగా సాధించిన ప్రతిభావంతులకు పురస్కారాలతో సత్కరించినట్లు మాస్టర్ మైండ్స్ అధినేత మట్టుపల్లి మోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిపిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిభను సత్కరిస్తే అది భావితరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా తెనాలి మరియు పరిసర ప్రాంతాల నుండి 206 మంది విద్యార్థినీ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

ట్రై కలర్‌ను విడుదల చేసేందుకు సిద్ధంగా బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్

గుంటూరు: భారతీయ వ్యవసాయ రసాయన పరిశ్రమలో ప్రధాన సంస్థలలో ఒకటైన బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్, సెక్షన్ 9 (3) ఎఫ్ఐఎం కింద ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 10 శాతం, డైఫెనోకోనజోల్ 12.5 శాతం, సల్ఫర్ 3 శాతం, స్కాండియం ఉత్పత్తి యొక్క స్వదేశీ తయారీకి రిజిస్ట్రేషన్ పొందినట్లు శుక్రవారం ప్రకటించింది. దీనితో బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ భారతదేశంలో ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్ 10 శాతం, డైఫెనోకోనజోల్ 12.5 శాతం, సల్ఫర్ 3 శాతం స్కాండియంను తయారు చేసిన మొదటి భారతీయ వ్యవసాయ రసాయన కంపెనీగా అవతరిస్తుంది. ఈ ఉత్పత్తిని జులైలో ట్రైకలర్ బ్రాండ్ పేరుతో విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, ఇది తమ పేటెంట్ ఉత్పత్తి అవుతుందని ఆగ్రోలైఫ్ లిమిటెడ్ ఎండి విమల్ కుమార్ అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కార దిశగా అడుగులు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ, తెనాలి రోడ్, గుంటూరు ఛానల్ వద్ద గల పంప్ హౌస్ ప్రాంతాన్ని ప్రస్తుతమున్న త్రాగునీటి సమస్య పరిష్కారానికి కార్పొరేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. గుంటూరు ఛానల్లో త్రాగునీటి లెవెల్ తగ్గటంతో గుంటూరు కెనాల్ నుంచి తీసుకోవడానికి గుంటూరు కార్పొరేషన్ వారితో, కలెక్టర్‌తో మాట్లాడారు. వీలైనంత త్వరలో మంగళగిరి నగరంలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు.

వృద్ధులను ఆదరించాలి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రతిఒక్కరి వృద్ధులను ఆదరించాలని గిరిధారి మిత్రమండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. స్థానిక కొత్తపేటలోని గిరిధారి మిత్రమండలి కార్యాలయంలో ఆదివారం వృద్ధులకు, వికలాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. దాతలు ఓబులశెట్టి సాంబశివరావు, శింగంశెట్టి వీరాంజనేయులు ఈ కార్యక్రమానికి తమ సహకారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలకలూరి శివరావు, పీవీ సంజీవరావు, గార్లపాటి రోశయ్య, మాచెర్ల ఉపేంద్ర, దిండు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'గుత్తికొండ'కు పరామర్శ

విశాలాంధ్ర-మంగళగిరి : ఇటీవల ప్రమాదవశాత్తు కాలుకు గాయమై ఆంజనేయకాలనీలో తన నివాస గృహంలో చికిత్స పొందుతున్న పద్మశాలి సంఘం నేత గుత్తికొండ ధనుంజయరావును ఆదివారం పలువురు పద్మశాలియ సంఘాల నేతలు కలిసి పరామర్శించారు. పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి విన్నకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మరుగుడు లక్ష్మీనారాయణ, పట్టణ పద్మశాలి బహుత్తమ సంఘం అధ్యక్షులు చింతకింది కనకయ్య, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరస్వామి, సహాయ కార్యదర్శి రామనాథం పూర్ణచంద్రరావు, కోస్తాంధ్ర పద్మశాలి సంఘం యువజన విభాగం అధ్యక్షులు బల్లా పరమేశ్వరరావు తదితరులు ధనుంజయరావును పరామర్శించిన వారిలో ఉన్నారు.

నేడు స్పందన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సోమవారం ప్రజల నుండి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండిలి స్పందన కార్యక్రమం జీఎంసీ కాన్ఫరెన్స్ హాల్లో ఉంటుందన్నారు. 8:30 గంటల నుండి రిజిస్ట్రేషన్ జరుగుతుందని కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

నాణ్యతకు నోచుకోని నాడు-నేడు పనులు..

- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు
- రూ. కోట్ల ప్రజాధనం వృధా
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

విశాలాంధ్ర-చేబ్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకం అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో లక్ష్యం నీరు గారిపోతుంది. కోట్ల రూపాయల నిధులు నీటిలో పోసిన పన్నీరవుతోంది. మండల కేంద్రం చేబ్రోలులోని పాతరెడ్డిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో బాత్ రూములు నాడు-నేడు కింద నిర్మిస్తున్నారు. నాలుగు నెలలుగా పనులు జరుగుతున్నాయి. పనులు నిర్మాణానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు తీర్మానం చేసుకొని తాపీ మేస్త్రీ చిన్న బాబుతో పనులు చేయిస్తున్నారు. వేసవి సెలవులకు ముందు అందరూ కలసి ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు డ్రా చేసుకున్నారు. నగదు పంచుకోనే విషయంలో వచ్చిన విభేదాలతో వేసవి సెలవుల అనంతరం చిన్న బాబుతో కాకుండా కొత్త మేస్త్రీతో పనులు ప్రారంభించారు. దీంతో విషయం బయటపడింది.

నాసిరకం ఇటుకలు వాడకం...

ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి పేద విద్యర్థులకు అన్ని సౌకర్యలు ఉండే విధంగా పాఠశాలలు రూపొందిస్తుంటే కొందరూ అధికారుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే చందంగా అవినీతికి పాల్పడుతున్నారు. పట్టుకుంటేనే పగిలిపోతున్న ఇటుకలు వాడటంతో ఈ బాత్ రూములు నాలుగు రోజులైన ఉంటాయా అని స్థానికులు వాపోతున్నారు. ఇటువంటి ఇటుకలతో నిర్మాణాలు చేస్తుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో అర్థం కాని ప్రశ్నగా ఉందని కొందరూ పేర్కొంటున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ ...

నాలుగు నెలలుగా పనులు జరుగుతోంటే అధికారులు అటువైపు వెళ్లకపోవటంతో పనులు నాసిరకంగా జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇంజనీరింగ్, మండల స్థాయి అధికారులు బిల్లులు చేసే సమయంలో తప్పక పరిశీలించిన తరువాతనే బిల్లులు మంజూరు చేయాలి కాని ఇక్కడ అవేవి పని చేయటం లేదనేది వాస్తవం. పదికాలాలు ఉండాల్సిన బాత్ రూములు అధికారుల అవినీతితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు పనులు పరిశీలించి నాసిరకం ఇటుకలతో జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతన్నారు.

తక్కువ నగదు ఇస్తున్నారు: చిన్న బాబు

పాఠశాలలోని నాడు-నేడు పనులు చేయించుకోని తమ పేరుపై ఎక్కువ మొత్తంలో బిల్లులు చేసి తమకు తక్కువ మొత్తం ఇస్తున్నారు. అడిగినందుకు తమను పని నుంచి తీసేశారు. ఈ విషయం ఎంఈఓను విశాలాంధ్ర వివరణ కోరగా తాపీమేస్త్రీ సక్రమంగా పని చేయకపోవటంతో తొలగించారు. ఇటుకలు నాసి రకంగా ఉండటంతో వాటిని మార్చమని చెప్పామన్నారు.

వైసీపీకి సత్తా ఉంటే కార్పొరేషన్ ఎన్నికలు జరపాలి

విశాలాంధ్ర-మంగళగిరి : జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు ఆధ్వర్యంలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస విభాగం చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన పార్టీకి వందల మంది నాయకులతో లక్షలాది కార్యకర్తలు ఉన్నారన్నారు. ఎన్నికలకు ఇంకా ఆరు నెలలు మాత్రమే ఉందని, ఈ లోపు గ్రామ, డివిజన్, బూత్ కమిటీలు అతి త్వరలో ఏర్పాటు చేసుకొని ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని అన్నారు. మంగళగిరిలో రానున్న ఎన్నికల్లో జనసేన నిలబడుతుందని, పార్టీ గెలుపు కోసం కృషి చేసి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని ముఖ్యమంత్రి అయ్యేవిధంగా మనందరం కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 175 స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేయమని సవాల్ విసురుతున్నారని, ఈ వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో గెలిచే సత్తా ఉంటే మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు జనసేన పార్టీ తరపునుంచి తాము సిద్ధంగా ఉన్నామని, ఎన్నికలు జరిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టి రామకృష్ణ, షేక్ కైరుల్లా, బడే కోమలి, జంజనం వెంకట సాంబశివరావు, దాసరి శివ నాగేంద్రం, పసుపులేటి సాయి చైతన్య, తిరుమలశెట్టి కొండలరావు, వాసా శ్రీనివాసరావు, సామల నాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ బాబు ఆధ్వర్యంలో భారత్ జోడో యాత్ర

విశాలాంధ్ర-గుంటూరు : రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలలో భాగంగా ఇండియన్ నేషనల్ యూత్ కాంగ్రెస్ పిలుపుమేరకు గుంటూరు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కట్టా జవహర్ బాబు ఆధ్వర్యంలో భారత్ జోడో యాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమై నగరంపాలెం ఇందిరా గాంధీ విగ్రహం వద్ద వరకు కొనసాగింది. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నిర్వహించిన భారత్ జోడో యాత్రని స్ఫూర్తిగా తీసుకొని, ఈ దేశ ప్రజలకు వారు ఇచ్చిన సందేశాన్ని మరొక్కసారి వారి జన్మదినం సందర్భంగా ప్రజలందరికీ తెలియజేయాలని సంకల్పంతో ఈ యాత్ర నిర్వహించడం జరిగిందని జవహర్ బాబు తెలిపారు. బీజేపీ చేస్తున్న విద్వేషపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా దేశంలో శాంతి సమానత్వంతో ప్రజలంతా మెలగాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అందుకోసం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. 2024 జరగబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పగడాల ప్రసాద్, ప్రదీప్ బన్ని, మెహమూద్, జయరాం, తోట హేమంత్, మహేష్, సుధీర్, కిషోర్, రాము, అభిలాష్, మనీ చౌదరి, నరేంద్ర, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మందపాటి రామకృష్ణారెడ్డి మొదటిసారిగా స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియంలోని వాకర్స్ సంస్థలను ఆదివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా లాఫింగ్ క్లబ్ అధ్యక్షులు షేక్.లాల్ వజీర్ రామకృష్ణారెడ్డిని బొకే, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రామకృష్ణారెడ్డిని సత్కరించిన వారిలో పెద్ది శివరాం ప్రసాద్, ఫ్రెండ్స్ వాకర్ సంస్థ సభ్యులు ఉన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులు

విశాలాంధ్ర-తెనాలి : ఇంటర్‌లో 925 మార్కులు, ఇతర డిగ్రీ కోర్సులలో 80 శాతం పైగా మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థినులకు 10వేల రూపాయల స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు శ్రీ కన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి సెక్రటరీ పెండేల వెంకట్రావు తెలిపారు. ఇందుకోసం తమ మార్కుల నకలు, ఫోటో కాపీలు పంపాలని అదేవిధంగా ఇంటర్ నుండి పిజి వరకు చదువుకునే విద్యార్థినిలకు ఉచిత భోజనం మరియు వసతి కల్పించబడునని చెప్పారు. ఈ సౌకర్యాలను తెనాలి పట్టణ మరియు పరిసర ప్రాంతాల విద్యార్థినులు వినియోగించుకోవాలని మరిన్ని వివరాలకు 94402 58574 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

చలో విజయవాడ జయప్రదం చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-పొన్నూరు: భవన నిర్మాణ కార్మికుల హక్కులు కాపాడుకునేందుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన విజయవాడలో జరుగు నిరసన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పొన్నూరు నియోజకవర్గం ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆరేటి రామారావు అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఈటియుసి ఆధ్వర్యంలో పెయింటింగ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు డక్కుమల్ల మాణిక్యరావు అధ్యక్షత వహించగా ఆరేటి మాట్లాడుతూ 11 రకాల సంక్షేమ సౌకర్యాలను గత ప్రభుత్వాలు ఏర్పాటు చేయగా నేటి ప్రభుత్వం ప్రస్తుతం వాటిని నిలిపివేసిందని పేర్కొన్నారు. రాడ్ బెండింగ్ యూనియన్ అధ్యక్షుడు మిక్కిలి జాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 32వేల క్లెయిమ్‌లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెయింటింగ్ యూనియన్ నాయకుడు ఎబ్బినేజర్ మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రభుత్వ సంక్షేమ బోర్డు ద్వారా ఇవ్వకపోవడం వలన కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఎంఈఓ-1లను కొనసాగించాలి: ఫ్యాప్టో

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లాలో ఎంఈఓ-1గా పని చేస్తున్న జిల్లా పరిషత్‌కి చెందిన ఉపాధ్యాయులను యధాతథంగా కొనసాగించాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టులను ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం.కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చలకు భిన్నంగా ఎంఈఓ-2 నియామకపు జీఓ ఇవ్వడాన్ని తప్పుపట్టారు. దీని వలన ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని అన్నారు. పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సంపత్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో అధికారులు తొందరపాడు నిర్ణయాలు వల్ల విద్యారంగానికి నష్టం జరుగుతుందని మెర్జింగ్, ప్లస్-2, ఎంఈఓ-2 దీనికి ఉదాహరణ అన్నారు. ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు కె.బసవలింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల పట్ల వివక్ష చూపుతుందని, ప్రభుత్వ ఉపాధ్యాయుల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని అన్నారు. మెజారిటీగా ఉన్న జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని అన్నారు. నాయకులు నరసింహారావు, వేళంగిణి రాజు మాట్లాడుతూ ఎంఈఓ-2 జాబ్ చార్ట్‌పై స్పష్టత ఇవ్వకుండా కౌన్సిలింగ్ నిర్వహించడం సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గేరా మోహన్‌రావు, జి.విజయసారథి, ఎం.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సినీ కార్మికులకు సామాజిక భద్రత

విశాలాంధ్ర-తెనాలి : సినీ పరిశ్రమలోని 24 విభాగాల కార్మికులకే కాకుండా దేశవ్యాప్తంగా అసంఘటిత కార్మికులందరికీ భారత ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తుందని గుంటూరు జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ధూళిపూడి వెంకట శివప్రసాద్ చెప్పారు. స్థానిక మా-ఏపి కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ సుల్తానాబాద్‌లోని రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో ఈ-శ్రమ్ కార్డులకు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్డులు కావలసిన కార్మికులందరూ ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు తీసుకురావాలని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మా-ఏపి వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ, 16 నుండి 59 సంవత్సరాల లోపు వయసున్న ఫీఎఫ్ లేని అసంఘటిత కార్మికులంతా అర్హులేనని చెప్పారు. సమావేశంలో ఆలియా, ధనలక్ష్మీ, మిలటరీ ప్రసాద్, అమీర్ చౌదరి, రఫీ, అరుణకుమారి, శ్యామ్, రాకేష్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరితో పాటు పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసి పోలీసులు కళ్ళు కప్పి తిరుగుతున్న నిందితులను రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశ పెట్టారు. వారి నుండి పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రూరల్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ క్రాంతి కిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 14వ తేదీన నవులూరు గ్రామానికి చెందిన ముప్వ వెంకటేశ్వరరావు చిన కాకాని ఎన్నారై ఆస్పత్రి బయట టీస్07ఈవై2669 అనే నెంబర్ గల యాక్టివా వాహనాన్ని పార్క్ చేసి ఆస్పత్రిలో బంధువులను పరామర్శించి తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. బైక్ చోరీకి గురైనట్లు గమనించి అదే రోజు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుంటూరు అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు డిఎస్పి రాంబాబు నేతృత్వంలో రూరల్ సీఐ భూషణం ఎస్సైలు క్రాంతి కిరణ్ జగన్మోహన్ రావు లు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం డాన్ బాస్కో పాఠశాల వద్ద అనుమానితంగా సంచరిస్తున్న మంగళగిరి శాలివాహన పేటకు చెందిన ఒంటి పులి ధర్మయ్య, సత్తెనపల్లికి చెందిన వేముల శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకొని విచారించారు. తామే సదరు బైక్‌తో పాటు మిగిలిన బైక్లను చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. మొత్తం 10 బైకులను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ క్రాంతి కిరణ్ తెలిపారు. ఎస్సై జగన్మోహన్రావు సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో భాష్యం సంచలనం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాలలో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ ఓపెన్ కేటగిరిలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించిందని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాలలో భాష్యం విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో ఎ.వి.శివరామ్ ఆలిండియా 5వ ర్యాంకు, వై.వి.మణీందర్ రెడ్డి 10వ ర్యాంకు సాధించారన్నారు. అంతేకాక వివిధ కేటగిరీలలో వై.వి.మణీందర్ రెడ్డి ఆలిండియా 1వ ర్యాంకు, కె.లక్ష్మీసూర్య 8వ ర్యాంకు, పి.నిశ్చల్‌సుభాష్ 7వ ర్యాంకు, ఆర్.అక్షయ్‌కార్తీక్ 8వ ర్యాంకు వంటి 50లోపు 11 అత్యుత్తమ ర్యాంకులతో పాటు, ఆలిండియా 100లోపు 16 ర్యాంకులు, 200లోపు 23 ర్యాంకులు, 1000లోపు 59 ర్యాంకులు, 2000లోపు 99 ర్యాంకులు, 5000లోపు 181 ర్యాంకులు సాధించడంతో పాటు ఆల్‌టైం ది బెస్ట్‌గా నిలిచిందన్నారు. ఆ అద్భుత ఫలితాలకు పక్కా ప్రణాళికతో కూడి భాష్యం ఐఐటీ ఫౌండేషన్ కరిక్యులమే కారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని చైర్మన్ రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

రహదారుల పరిశీలన

విశాలాంధ్ర-తాడేపల్లి: పెనుమాకలో నిర్మాణం జరుగుతున్న రెండు తారు రోడ్లను మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే కార్పొరేషన్ అధికారులు, వైసీపీ నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. పెనుమాక వైఎస్ఆర్ సెంటర్ నుండి లంక పొలం డొంక (పెద్ద డొంక) సుమారు 900 మీటర్ల పొడవుతో సుమారు రూ.90 లక్షల రూపాయలతో నిర్మాణం జరుగుతుంది. అలాగే పొలిమేర డొంక సుమారు 1.2 కిలోమీటర్ల డొంక సుమారు రూ.1 కోటి రూపాయలతో నిర్మాణం జరుగుతుంది. ఈ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించి వర్షాకాలం నాటికి ఈ రెండు డొంకలను నిర్మాణం పూర్తిచేయాలని కార్పొరేషన్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. నూతక్కి నుండి మెల్లెంపూడి మీదుగా కెఎల్‌యూ కట్ట వరకు సుమారు 2.5 కిలోమీటర్ల పొడవుతో సుమారు 2 కోట్ల 20 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన తారు రోడ్డును కార్పొరేషన్ అధికారులతో, స్థానిక గ్రామాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో, రైతులతో కలిసి ఎమ్మెల్యే ఆర్కే ఆదివారం పరిశీలించారు.

పెద్ద కోనేరు అభివృద్ధి పనులపై సమీక్ష

విశాలాంధ్ర-మంగళగిరి : నగర పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవాదాయ శాఖ కమిషనర్ అనంతరం పెద్ద కోనేరు(పుష్కరిణి) అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. పెద్దకోనేరు అభివృద్ధి పనులు జరుగుతున్న తీరుతెన్నులపై ఎమ్మెల్యే ఆర్కే ఎండోమెంట్ కమిషనర్‌కి వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ 480 ఏళ్ల చరిత్ర కలిగిన పెద్ద కోనేరు(పుష్కరిణి) అభివృద్ధి కోసం సీజీఎఫ్ కింద కోటి రూపాయలు, దేవస్థానం నుంచి రూ.50 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. పెద్ద కోనేరు అభివృద్ధికి మరికొన్ని నిధులు కావలసి ఉందని కమిషనర్‌ను కోరడం జరిగిందని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న నిష్ణాతులైన ఇంజనీరింగ్, ఇరిగేషన్, ఆర్కియాలజీ, ఎండోమెంట్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారని తెలిపారు. ఎండోమెంట్ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వానికే లీజుకి ఇస్తే ప్రజలకు ఉపయోగం జరుగుతుందని అన్నారు. ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో పెద్దకోనేరు అభివృద్ధికి సంబంధించి కమిటీని ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయనున్నట్లు స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, కార్యనిర్వాహణాధికారి రామకోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నారాయణ విజయకేతనం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జాతీయ స్థాయిలో నిర్వహించబడిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాల్లో గుంటూరు జిల్లా నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని నారాయణ కోర్ డీన్ వీరగంధం శ్రీనివాసరావు, డీన్ వల్లభరావు తెలిపారు. ఆదివారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని కళాశాలలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉత్తమ ర్యాంకులు సాధించి విద్యార్థులకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అకడమిక్ ఇన్‌ఛార్జ్ తార్నాక చంద్రశేఖర్, డీజీఎం శ్రీనివాస రెడ్డి, కోర్‌డీన్‌లు మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ ఫలితాలు వలే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా నెంబర్ వన్ స్థాయి ర్యాంకులు సాధించటంలో మా శ్రమతో పాటు, అధ్యాపకులు నిరంతర పర్యవేక్షణ, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఎంతో తోడ్పడ్డాయని అన్నారు. జె.నితిన్ 232 ర్యాంకు, అదిల్ ఆలీమహ్మద్ 334, ఎం.చిరంజీవి 822, జి.ఓంకార్ 837 ర్యాంకులతో 1000లోపు నలుగురు, 2వేల లోపు 6 మంది, 5వేల లోపు 16 మంది ఉన్నారన్నారు. డీన్ కోటేశ్వరరావు, ఏజీయం హనుమంతరావు, రాజు, ప్రిన్సిపాల్స్ సీహెచ్ శ్రీనివాస్, జి.శ్రీనివాస్, రమాదేవి విజేతలను వారి తల్లిదండ్రులను అభినందించారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన **నడింపల్లి వెంకట సుబ్బారావు** గారి కుమారుడు **నడింపల్లి విజయ ప్రసాదు** ఆర్/ఓ బ్రాడీపేట, గుంటూరు వారి సూచనల ప్రకారం తెలియజేయునది ఏమనగా నా క్లయింటు తన సొంతవని మీద పల్నాడుజిల్లా చిలకలూరిపేట నుండి నాదెండ్ల మండలం తూబాడు గ్రామమునకు వెళ్ళగా, నా క్లయింటు తన వద్దనున్న గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ గారి కార్యాలయంలో రిజిష్టర్ కాబడిన **ఒరిజినల్ డాక్యుమెంట్లు నెం :4445/1963 మరియు ఒరిజినల్ డాక్యుమెంటు నెంబరు 2754/1941** లు వున్న కవరు తూబాడు గ్రామ పరిసర ప్రాంతంలో జారిపోయినవి. సదరు డాక్యుమెంట్లు ఎవరికైన దొరికిన యెడల వాటిని మా క్లయింటుకు అందజేసిన తగిన బహుమతి ఇవ్వబడును సదరు డాక్యుమెంట్లను ఇతర పనులకు వినియోగించిన మా క్లయింటు తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయటమైనది.

భట్రాజు కృష్ణకిషోర్, న్యాయవాది
201, గోకుల్ అపార్ట్‌మెంట్,
4వ లైను, ఏ.టీ.అగ్రహారం
గుంటూరు - 522004.
సెల్ : 9700068569, 9848560714

గంజాయి అరికట్టలేని సీఎం గద్దె దిగాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్రంలో గంజాయిని అరికట్టలేని సీఎం జగన్‌మోహన్ రెడ్డి వెంటనే గద్దె దిగిపోవాలని జిల్లా తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ, మన్నవ మోహన కృష్ణలు డిమాండ్ చేశారు. గంజాయి, డ్రగ్స్ మాఫియాను అరికట్టి, యువత భవిష్యత్తు కాపాడాలని కోరుతూ ఆదివారం తాడేపల్లి టీడీపీ కార్యాలయం నుంచి మంగళగిరి నియోజకవర్గ తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేశారు. ర్యాలీ అంబేద్కర్ సెంటర్‌కు చేరుకోగానే తెలుగు యువత, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్‌కు ముందు రావిపాటి సాయికృష్ణ, మన్నవ మోహన కృష్ణలు మీడియాతో మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా అరికట్టడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్, డీజీపీ పూర్తిగా విఫలమయ్యారని, గంజాయి వల్ల విద్యార్థుల భవిష్యత్తు పూర్తిగా నాశనం అయిందని అసమర్థ ముఖ్యమంత్రి వల్ల రాష్ట్రానికి ఈ దుస్థితి వచ్చిందన్నారు. రేపల్లె నియోజకవర్గం ఉప్పాలవారిపాలెంలో అక్కను వేధించడంపై ప్రశ్నించిన తమ్ముడును గంజాయి మత్తులో పెట్రోల్ పోసి తగలబెట్టారని అన్నారు. అమర్నాథ్ గౌడ్ హత్య కేసులో దోషులు అందరిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ ఫిరోజ్, గుత్తికొండ కిరణ్ యాదవ్, చెరుకుపల్లి నాగరాజు, సయ్యద్ జిలాని, బుల్లా కుమార్ బాబు, పడవల మహేష్, కొప్పుల మధుబాబు, దాసరి సునీల్, బోగి వినోద్, కందుల నాగార్జున, గుద్దంటి నాగేశ్వరరావు, కాటం అంజిరెడ్డి, ఉద్దంటి ధనోజ్ కుమార్, పినపాటి జీవన్, రాయపూడి కిరణ, నల్లగొర్ల సుధాకర్, దర్శి హరికృష్ణ, కంభం సాయిచంద్, గుండికోటి యాదవ్, షేక్ హారిఫ్, మన్యం రవి, ఎస్.అశోక్, జి.స్వామి, మణికంఠ, ఎం.బాబి, ఉదయ్, రహూల్, కళ్యాణ్, శివారెడ్డి, కె.తేజ, డి.ప్రశాంత్, హరిష్ పాల్గొన్నారు. నాయకుల అక్రమ అరెస్ట్ గురించి తెలుసుకున్న పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, దామర్ల రాజు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, రంగిశెట్టి నరేంద్ర(బాబీ), కారంపూడి అంకమ్మరావులు సంఘీభావం తెలియజేశారు.

మానసిక ఆరోగ్యంతోనే మంచి సమాజం సాధ్యం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వ్యక్తులు సంపూర్ణ మానసిక ఆరోగ్యంగా ఉన్నప్పుడే పరిణితి కలిగిన సమాజం సాధ్యమవుతుందని, అందుకోసం స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలతో కలిసి ఉమ్మడి కార్యాచరణతో పని చేయాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్, కాటూరి మెడికల్ కళాశాల మానసిక వైద్యవిభాగాధిపతి డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం 'మానసిక సమస్యలు-కుంగుబాటు-మతిమరుపు'అనే అంశాలుపై ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా 45కోట్ల మంది భారతదేశ జనాభాలో 7.5శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఇండియాలో 13 నుంచి 17ఏళ్ళ బాలల్లో 7.5శాతం మానసిక ఆందోళన, ఒత్తిడి, మాధక ద్రవ్యాల వినియోగం, ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతున్నారని వెల్లడించారు. అదేవిధంగా మానసిక సమస్యలు ఉన్నట్లు బయటికి చెబితే సమాజం చులకన చేస్తుందన్న భయంతో చాలా మంది తమకున్న లక్షణాలను చెప్పుకునేందుకు జంకుతున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడుతున్న చిన్నారులు, నిద్రలేమితో సతమతమవుతున్న యువకులు, చదువుకు, కుటుంబ సభ్యులకు తగిన సమయాన్ని వెచ్చించలేక కుంగుబాటుకు గురవుతున్నారని అన్నారు. వ్యాయామం లేకపోవటం కూడా మానసిక ఆరోగ్యాన్ని కోల్పోవటానికి ఒక కారణమన్నారు. వ్యాయామం చేయడం, సరిపోయేంత నిద్రపోవటం, మత్తు పానీయాలు, పొగాకు వాడకానికి దూరంగా ఉండటం, వైద్య చికిత్స నియమాలను జాగ్రత్తగా పాటించటం ద్వారా మానసిక సమస్యలను అధిగమించవచ్చునా్నరు. ఈ సభలో కొండా శివరామిరెడ్డి, సాయిరాం, రాజన్న, ఏవీ రామారావు తదితరులు ఉన్నారు.

పిల్లలకు తొలి హీరో తండ్రినే

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇంటి బరువు బాధ్యతలను మోసే తండ్రి పిల్లలకు తొలి హీరో అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. ఫాదర్స్ డే సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'మా నాన్న నుంచి నేను నేర్చుకున్న పాఠాలు'అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఉన్నత వ్యక్తిత్వాన్ని, విలువలను పిల్లలు తండ్రి నుంచే నేర్చుకుంటారని అన్నారు. నడక నేర్పేవారు నాన్న, భుజాలపైకి ఎత్తుకుని లోకం చూపే వారు నాన్న అని ప్రశంసించారు. నవ మాసాలు మోసి కనేది తల్లయితే తన చివరి శ్వాస వరకు బిడ్డల బంగారు భవిష్యత్ కోసం పరితమించి శ్రమించే వారు నాన్న అని అన్నారు. రచయిత్రి ఏవీకే సుజాత మాట్లాడుతూ తండ్రిని త్యాగానికి ప్రతీకగా, మార్గదర్శిగా కొనియాడుతూ కవులు కవిత్వం రాశారన్నారు. తన సంతానం ఉన్న తిని సమాజం పొగిడినప్పుడు పొంగిపోయే తొలివ్యక్తి తండ్రేనని పేర్కొన్నారు. ఉత్తమ తండ్రిగా కళ్యాణం చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజన్న, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

పోలేరమ్మ ఆలయంలో పూజలు

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ ఆలయంలో ఆదివారం పూజలు జరిగాయి. ఆదివారం అమావాస్య సందర్భంగా మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో జీవించేలా చేయమని అమ్మవారిని వేడుకున్నారు. కొందరు మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్ళుచేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

విశాలాంధ్ర-నూజెండ్ల : మండలంలోని తెల్లపాడు గ్రామపంచాయతీ పరిధిలో గల టి అన్నవరం గ్రామంలో మూడు పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా అగ్ని ప్రమాదానికి గురై కట్టుబట్టలతో ఇబ్బంది పడుతున్నవారికి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ద్వారా పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులకు సమాచారం అందజేయడంతో వారు స్థాపించిన శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా ఆదివారం అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం, బియ్యం, వంట సామాగ్రి, బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని బాధితులకు అండగా ఉంటామని ప్రభుత్వం త్వరితగతిన బాధితులకు ఇల్లు మంజూరు చేసి వారికి ఆర్థిక సహాయం చేయాలని లేనిపక్షంలో బాధితుల తరఫున పోరాడుతామని తెలియజేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు వంకాయలపాటి పేరయ్య, రావుల మల్లేశ్వరరావు, కొమ్మ శ్రీనివాసరావు, గంగినేని చంద్రశేఖర్, రొద్ద వీరాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధిలోని నెహ్రూ నగర్ తండాకు చెందిన జటావత్ బాలునాయక్ వైద్య ఖర్చు లు నిమిత్తం రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి ఆదివారం అందజేశారు. తండాలో జరిగిన గ్రామోదయం కార్యక్రమంలో బాలునాయక్ తమ అనారోగ్య పరిస్థితిని మండల స్పెషలాఫీసర్ సంజీవరావుకు విన్నవించుకున్నాడు. క్రోసూరులో జరిగిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి సభలో బాలునాయక్ ఆరోగ్య పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, కలెక్టర్ శివశంకర్ లోతేటి వివరించాడు. వెంటనే సీఎం లక్ష రూపాయలు మంజూరు చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి బాలునాయక్ చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్, సర్పంచ్ రమావత్ పద్మాబాయి, సుబ్రహ్మణ్యం నాయక్ పాల్గొన్నారు.

నిందితుడిని ఉరి తీయాలి

విశాలాంధ్ర-వినుకొండ: బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలో పదవ తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్‌పై పెట్రోల్ దాడి చేసిన వెంకటేశ్వర్ రెడ్డిని ఎన్కౌంటర్చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన అక్కపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న వెంకటేశ్వర్ రెడ్డిని అడ్డుకున్న పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్‌పై పెట్రోలు పోసి తగలబెట్టడం దుర్మార్గమైన చర్యని, మహాత్మా గాంధీ కలలుగన్న రోజు ఎప్పటికి వస్తుందో ఆడపిల్లలు అర్ధరాత్రి ఒంటరిగా తిరిగిన రోజు నిజమైన స్వతంత్రం వచ్చినట్టు అని ఆయన చెప్పిన మాటలు ఒక్కసారి గుర్తు తెచ్చుకున్నట్లైతే అర్ధరాత్రి దేవుడి ఎరుగ పట్టపగలే తిరిగే పరిస్థితి లేదని వెంటనే ప్రభుత్వం ఆ కుటుంబానికి కోటి రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ ఇవ్వాలని, వెంకటేశ్వర్ రెడ్డిని ఎన్కౌంటర్ చేయాలని లేదా చట్టపకారం ఉరి తీయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

పేద బ్రాహ్మణులకు సరకుల అందజేత

విశాలాంధ్ర-వినుకొండ: బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో జీవి మాధవరావు ఆఫీస్ నందు 16 నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతనవస్త్రాలు పంపిణి నిర్వహించారు. హైద్రాబాద్ వాస్తవ్యులు అక్కి రాజు శశికళ 10 కుటుంబాలకు, బియ్యం, చీరలు అందజేయగా, చింత లచెర్వు రాఘవేంద్ర, చామర్తి భవాని శంకర్, పుట్టం రాజు నారాయణ రావు, గొర్తి నాగరాజు , మతుకుమల్లి మురళిధర్ , గోగుల పాటి మహాలక్ష్మి, మౌనిక ,దారా రామమూర్తి ,పాలుట్ల రవి కిరణ్‌ల సహాయసహకారాలతో 16 కుటుంబాలకు బియ్యం, చీరెలు బహుకరణ జరిగినది. ఈ కార్యక్రమం అనంతరం సుదీర్ఘ కాలము నుండి సహాయ సహా కారములు అందించుచున్న చింత కుంట శంకర రావు, కుడుముల రామారావు (బొల్లాపల్లి కరణం) మరియు శిష్టా శ్రీ శైలమల్లి ఖార్జున శాస్త్రి , మరియు అక్కిరాజు శశికళలకు మెమెంటో, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సిహెచ్ రఘు, దూళి పాళ్ళ నాగేశ్వరావు, అన్నా ప్రగడ వెంకటేశ్వర రావు, దిట్ట కవి శ్రీనివాసా చార్యులు, సిహెచ్ భద్రయ్య, దాతలు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన బోరు సోలార్

విశాలాంధ్ర-యడ్లపాడు : గుర్తుతెలియని వ్యక్తులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న బోరు సోలార్ ఫలకాలు దెబ్బతిన్నాయి. బాధిత రైతు తెలిపిన వివరాలు మేరకు యడ్లపాడుకు చెందిన పోపూరి వెంకటరతయ్య యడ్లపాడు కార్చేల గ్రామాల మధ్య విశ్వనాధునికంద్రిక పొలంలో జామ, నిమ్మ తోటలు ఉన్నాయి. ఆయా తోటలకు నీటి వసతి కోసం బోరు, సోలార్ విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నిమ్మ తోట పక్కనే ఉన్న ఎండిపోయిన పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో గాలులకు మంటలు బోరు, సోలార్ ఫలకాలు చుట్టూ వ్యాపించాయి. పక్కనే ఉన్న పోపూరి నాగేశ్వరరావు జామాయిల్ తోటను మంటలు చుట్టుముట్టాయి. ప్రమాదాన్ని గమనించిన బాధిత రైతు బోర్ నీటితో మంటలను అదుపు చేశాడు.

ప్రమాదంలో బోరు, సోలార్ ఫలకాలు, జామాయిల్ చెట్లు తగలబడ్డాయి. లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసుకున్న సోలార్ పరికరాలకు నష్టం వాటిల్లినట్లు, నిందితులను గుర్తించి కేసు నమోదు చేయాలని బాధిత రైతులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

24న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : ఈ నెల 24వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు అమరావతి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మేకల హనుమంతరావు యాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతున్నట్లు అమరావతి ఎంపీడీవో పి.మాధురి తెలిపారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకి జరిగే సమావేశానికి మండల పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ కోఆప్షన్ నెంబర్ ఉన్నతాధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు

విశాఖ ఉక్కు కాపాడుకుందాం

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రంలోని ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కును ఉక్కు ఫ్యాక్టరీలో పనిచేసే వేలాది మంది కార్మికులతో పాటు పరోక్షంగా లబ్ధి పొందుతున్న లక్షలాది మంది కార్మికులు రాష్ట్రంలోని యువజన, విద్యార్థి, కార్మిక, రైతు, అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకుంటామని ఫ్యాక్టరీలో పని చేయు కార్మిక సంఘం నేతలు ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, సీఐటీయూ జనరల్ సెక్ర టరీ రామస్వామి తెలిపారు. ఆదివారం నరసరా వుపేట పట్టణంలోని పల్నాడు బస్టాండ్ వద్ద గ్రాండ్ సిటీ స్టార్ లాడ్జి ఫంక్షన్ హాల్‌లో జరిగిన అఖిలపక్ష రాజకీయ పార్టీల ప్రజాసంఘాల, కార్మిక, ఉద్యోగ, మేధావి, రైతు, సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం రైతు సంఘం జిల్లా నాయకులు ఏపూరి గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1966లో ఎందరో త్యాగధనుల పోరాటాల ఫలితంగా ఆనాడు 67 మంది శాసనసభ్యులు, ఏడుగురు పార్లమెంటు సభ్యుల రాజీనామాల నేపథ్యంలో 32 మంది యువకుల ప్రాణ త్యాగాల బలిదానాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రజల సహకారంతో ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని, దీనికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగులు కార్మికులు, మేధావులు, రైతులు, ప్రజలందరి సహకారం కావాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శులు ఏ మారుతి వరప్రసాద్, గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆనాడు కమ్యూనిస్టులు, యువజన సంఘాలు పక్క రాష్ట్రాలకు తరలి వెళ్లుచున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మన రాష్ట్రంలోనే నిర్మించుటకు ఎన్నో పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు. అంత పెద్ద స్థాయిలో ఉద్యమించి పోరాడి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని నరేంద్ర మోదీకి ఎలాంటి స్వాతంత్ర ఉద్యమ చరిత్ర లేదని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధనలో కనీస చేయూతలేదన్నారు. అటువంటి కార్పొరేట్ శక్తుల అనుకూల వర్గాలు బీజేపీ పెద్దల చేతిలో అత్యంత దారుణంగా ప్రజల ఆస్తి విశాఖ ఉక్కును బలి చేయడానికి రాష్ట్ర ప్రజానీకం ఒప్పుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. దీనిని ప్రజలు తీవ్రంగా పరిగణలో తీసుకోవాలని, ఈ రాష్ట్రంలో బీజేపీ కుయుక్తులు సాగకుండా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను, కార్మిక, రైతు, యువజన విద్యార్థి, మహిళ సంఘాలను కార్యోన్ముఖులను చేసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతులను చేసి విశాఖను కాపాడుకుంటామని వారన్నారు.

రౌండ్ టేబుల్‌లో వక్తల ఉద్ఘాటన

సమావేశంలో సీనియర్ న్యాయవాది సీహెచ్ ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్కే నాయుడు, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా నాయకులు గోదా జాన్‌పాల్, ఎంఐఎం పార్టీ నాయ కులు మస్తాన్ వలి, మహిళా సంఘం నాయకులు చెరుకుపల్లి నిర్మల, నాగమ్మ, సీపీఐ, సీపీఎం ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో తాము ప్రత్యక్షంగా పాల్గొని ప్రైవేట్‌పరం కాకుండా ఏ స్థాయిలో జరిగే పోరాటమైన ఆ కార్యక్రమాలలో తమ వంతు పాత్ర నిర్వహిస్తామన్నారు. కచ్చితంగా విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, అధ్యక్షులు తాళ్లూరు బాబురావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు బాలకృష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, ఎఐవైఫ్ యువజన సంఘం నాయకులు రాజేంద్ర, షేక్ సుభాని, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ నాయకులు శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా నాయకులు ఆంజనేయులు నాయక్, ఎల్ఐసి ఉద్యోగులు గౌను, హుస్సేన్, వాగ్య నాయక్, ఆనంద్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం 2023 సెప్టెంబర్ నాటికి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ రద్దు చేయాలని, ఈ పోరాటానికి అన్ని తరగతుల ప్రజల మద్దతు కూడగట్టాలని, ప్రజా బ్యాలెట్ నిర్వహించాలని, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కేంద్రాలలో విస్తృతంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది.

నిరుద్యోగులపై సీఎం వైఖరి తెలపాలి

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రంలో నిరుద్యోగుల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఖరి తెలియజేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య పల్నాడు జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నరసరావుపేట అవ్వరు భవన్నారాయణ భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిరుద్యోగ యువతను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మించి మోసం చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో పాదయాత్రలు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న నేటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్ ప్రకటనలకే పరిమితం అయిందని అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల భర్తీ కోసం ఎదురు చూస్తున్నారని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల ముప్పై ఐదు వేల ఏడు వందల తొంబై నాలుగు పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. రాష్ట్రంలో యాభై ఐదు వేల ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వము పార్లమెంట్‌లో ప్రకటిస్తే రాష్ట్రంలో ఏడు వందల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ప్రకటించడం సరికాదని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 27, 28, 29, 30 తేదీలలో అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర యువజన, విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం గుంటూరులో నిర్వహించడం జరుగుతుందని ఈ యువజన సమ్మేళనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన నిరంకుశ వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. యువజన సమ్మేళనాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా నాయకులు వైదన వెంకట్, వాజ్యా నాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు

రాష్ట్రంలో అరాచక పాలన: టీడీపీ

విశాలాంధ్ర-వినుకొండ: చెరుకుపల్లి ఘటనపై వినుకొండలో ఆదివారం ఆందోళనలు మిన్నంటాయి. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆదేశాలతో పట్టణ పార్టీ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం రాజోలులో నిన్న వైకాపా అల్లరి మూకలే అమర్నాథ్ అనే బాలుడిని సజీవ దహనం చేశారని, హంతకులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆర్టీసీ బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లజెండాలతో నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి షమీంఖాన్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు రాష్ట్రం ఎస్సీ సెల్ మాజీ నాయకులు పల్ల మీసాల దాసయ్య మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని తెలిపారు. అడుగడుగునా అరాచకస్వామ్యం వర్ధిల్లుతోందని అన్నారు. అక్రమాల్ని ప్రశ్నిస్తే దౌర్జన్యాలు, తప్పుల్ని నిలదీస్తే హత్యాయత్నాలు, ప్రతిపక్ష పార్టీలకు మద్దతుగా నిలిస్తే అక్రమ కేసులు, ఆర్థికమూలాలను దెబ్బతీయడం, ఆస్తులను ధ్వంసం చేయడాలు నిత్యకృత్యంగా మారాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాపర్ల జగ్గారావు, పత్తి పూర్ణచంద్రరావు, దాసరి కోటేశ్వరరావు, తిరుమల శెట్టి బాలయ్య, వజ్రాల కృష్ణారెడ్డి, మీసాల మురళీకృష్ణ యాదవ్ లాయర్ సిద్దయ్య,గోరంట్ల హనుమంతరావు, మాదాల కృష్ణ, ఎలిశెట్టి రంగయ్య, కర్నాటి వెంకటేశ్వర రెడ్డి, నంబుల గురునాథం,గుంజి కాలింగరాజు, రాంబాబు, బోడేపూడి శంకర్, దస్తగిరి, సాంబ, ఇంజన్ కరిముల్ల, నర్రా కిషోర్, వీరంగం ప్రశాంతు, అక్బర్ బాషా,అలీ,ఫరూక్,వెంకట చారి పలువురి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అజాతశత్రువు మరియమ్మ

విశాలాంధ్ర-పెదకూరపాడు : అజాతశత్రువు మరియమ్మ అని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు మస్తాన్ షరీఫ్, అత్తిమల్ల రమేష్‌లు అన్నారు. పెదకూరపాడు గ్రామానికి చెందిన జన చైతన్య సమితి అధ్యక్షులు దాసరి విజయ భిన్నబాబు మాతృమూర్తి మరియమ్మ పెద్దకర్మ సందర్భంగా ఆదివారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ మరియమ్మ ఇరుగుపొరుగు వారితో తలలో నాలుక లాగా ఉంటూ అందరితో ప్రేమానురాగాలతో ఉండేవారని అలాంటి మరియమ్మ మన మధ్య లేకపోవడం బాధాకరమని వారన్నారు. మరియమ్మ వివిధ సేవా కార్యక్రమాలు పాల్గొని సేవలు అందించే వారని అన్నారు. అజాతశత్రువుగా కలిసిమెలిసి ఉండేదని వారు కొనియాడారు. సంతాప సభలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు, మద్దిరాల గంగాధర్, పాటిబండ్ల బాలయ్య, గుడిపూడి రాజు, అచ్యుతరావు, గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, బలుసుపాటి సాంబశివరావు, కవి, రచయిత కళ్ళం సుందరామిరెడ్డి, ఎమ్మార్పీసీ నాయకులు జానుబాబు, పి.రాజు, భూపతి, అన్నమయ్య, బెల్లంకొండ రాంబాబు, మద్దినేని సత్యనారాయణ, షేక్ అజిమల కరిముల్లా, ఏఐటీయూసీ నాయకులు పేతురు ఏసోబు, రత్నబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని మరియమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

జగన్ పాలనలో బీసీలకు రక్షణ కరవు

విశాలాంధ్ర-పెదకూరపాడు : నియోజకవర్గ తెలుగు విద్యార్థి అధ్యక్షులు గంగినేని వెంకటేశ్వర్లు(చిన్న) ఆధ్వర్యంలో పెదకూరపాడు అంబేద్కర్ విగ్రహం వద్ద బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామంలో విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ని హత్య చేయటం గురించి తెలుగు విద్యార్థి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తపరచడం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్‌లి పాల్గొని మాట్లాడుతూ బాపట్ల జిల్లా రాజోలులో బలహీన బీసీ వర్గానికి చెందిన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్‌ను వైసీపీ రౌడీ పెట్రోల్ పోసి కాల్చడం... జగన్ రెడ్డి పాలనలో బడుగు బలహీన వర్గాలకు చెందిన సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని రాష్ట్రంలో వైసీపీ గుండాలు విచ్చలవిడిగా అరాచకం చేస్తున్నారని అన్నారు. తన సోదరిని వేధించవద్దని అమర్నాథ్ చెప్పడంతో హంతకులు వైసీపీ గుండాల సహాయంతో అమర్నాథ్‌పై పట్ట పగలే పెట్రోల్ పోసి నిప్పంటించారని ఆవేదన వ్యక్తం చేశారు. అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం అమర్నాథ్‌పై జరిగిన దాడిని వక్రీకరిస్తూ అసత్య ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అరాచకాలు జరుగుతున్నాయని జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బలహీన వర్గాలపై దాడులు కూడా పెరిగాయని దుయ్యబట్టారు. జగన్ రెడ్డి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ వైసీపీ రౌడీస్వామ్యాన్ని అమలు చేస్తున్నారని మద్దిరాల గంగాధర్ ఆరోపించారు. రాష్ట్రంలో ఏదో ఒక మూల అనునిత్యం బలహీన వర్గాల వారిపై దాడులు జరుగుతున్నా రాష్ట్రంలో క్రైమ్ రేటు తగ్గిందని డీజీపీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసుల వ్యవహార శైలి మార్చుకొని దోషులను పట్టుకుని శిక్షించాలని లేదంటే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని మద్దిరాల గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి చిన్నరాజు, గంగినేని లీలావతి, వెలలచెరువు సురేష్, కంచర్ల సుధాకర్, షేక్ అబ్బాస్, గల్లా శివ, అత్తిమల రాజశేఖర్, చిన్నం వంశీ, నాన్న షరీఫ్. రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 20న విజయవాడలో జరగనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు కోరారు. ఆదివారం వీపీసౌత్‌లోని పలు కార్మిక సంఘ నాయకులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి పాటుపడాల్సిన ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రత్యేక చట్టాలను రూపొందించి కార్మిక వ్యవస్థను బలపరచాల్సిన ప్రభుత్వాలు ఆ దిశలో కనిపించడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలను నూరు శాతం సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాటిస్తూ రాష్ట్రంలోని కార్మికులకు తీరని నష్టం చేకూరుస్తున్నారన్నారు. సరైన ఉపాధి లేక నాలుగేళ్లుగా కార్మికులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టీపట్టనట్లు వ్యవహరించటం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. సంక్షేమ బోర్డు నుంచి పక్కదారి పట్టించిన రూ.1600 కోట్లను తిరిగి బోర్డుకు జమ చేయాలని ఆయన కోరారు. కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం జారీ చేసిన 1214 సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విజయవాడలో తలపెట్టిన మహా ధర్నాకు కార్మికులు, ప్రజాసంఘాలు, ప్రజలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిద్దెల దానియేలు, నేలటూరి ఇశ్రాయేలు, నాగేశ్వరరావు, కాచిపల్లి యేసయ్య, ఓర్సు హనుమంతరావు, గొర్రె బొచ్చు అంజి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం పెదకూరపాడు ఎస్సై ఐ.వెంకట్రావు పర్యటించి మద్యం సేవించి పేకాట ఆటాడే వారికి కౌన్సిలింగ్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించడం, పేకాట ఆడటం వలన కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని అన్నారు. ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు చేపడతామని, అవసరమైతే కేసులు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు పంపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కానిస్టేబుల్ మురళి, రమేష్, బసవరాజ్ నాయక్ తదితరులు ఉన్నారు.

అవధూత రంగయ్య తాత వార్షికోత్సవం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో ఆదివారం అవధూత రంగయ్య తాత 76వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి సూరిబాబు శర్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి రంగయ్య తాత ఆధ్యాత్మిక చింతనతో నాటు వైద్యం చేస్తూ అందరితో సన్నిహితంగా ఉండే వారిని అన్నారు. రంగయ్య తాత సిద్ధి పొందినాక ఆయన సమాధి చుట్టూ తిరుగుతూ పూజలు నిర్వహిస్తే అనారోగ్యం ఉండేవారికి ఎలాంటి జబ్బు అయినా తగ్గేదని నమ్మకంతో భక్తులు సమాధి చుట్టూ తిరుగుతూ ఉండేవారని, రోగాలు తగ్గుతాయని విశ్వాసంతో పూజ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

విశాలాంధ్ర-పెదకూరపాడు : వైసీపీ పాలనలో అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయని, రాష్ట్రం మూడు మర్డర్లు... ఆరు నేరాలతో పరిఢవిల్లుతుందని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లుగా అరాచక పాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్‌గా గంజాయికి అడ్డాగా మార్చారని దుయ్యబట్టారు. పొద్దున్నే కత్తిపోట్లు మధ్యాహ్నం మర్డర్లు సాయంత్రం సజీవదహనాలతో రాష్ట్రం అట్టడుగుతుందన్నారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెంలో పదవ తరగతి చదువుతున్న బాలుడును హత్య చేసిన తీరు అత్యంత బాధాకరమన్నారు. సోదరిని వేధిస్తున్నారని ప్రశ్నించిన బాలుడిని పెట్రోలు పోసి తగలబెట్టడం అత్యంత దారుణమని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్‌నే పోలీసులు చెబుతున్నారని, హత్య కేసు అత్యంత పారదర్శకంగా విచారించాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇన్ని నేరాలు జరుగుతుంటే క్రైమ్ తగ్గిందని డీజీపీ చెప్పడం విడ్డూరమని అన్నారు. బాలుడు కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థను వైసీపీ వ్యవస్థగా వాడుకుంటున్నారని, పోలీసులు ప్రజా భద్రత వదిలేసి ప్రతిపక్ష పార్టీలను వేధించడంపైన దృష్టి పెట్టారని ఆరోపించారు. వైసీపీ పాలనలో రోజురోజుకు అవినీతి, రౌడీయిజం, ఇసుక మాఫియా, మట్టి మాఫియా తదితర అనధికారం కార్యకలాపాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయని అన్నారు. నందిని ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వరరావు, పాడిబండ్ల బాలయ్య, మొక్కపాటి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల పెన్షన్ రూ.5 వేలకు పెంచాలి

విశాలాంధ్ర-అమరావతి : కళలకు పుట్టినిల్లు అయిన ఆంధ్రప్రదేశ్‌లో దినదినం కళాకారులు వృద్ధాప్యంలో తీవ్రమైన కష్టనష్టాలకు గురై అర్థాకలితో జీవనం సాగిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ అన్నారు. కళాకారులను ఆదుకునేందుకు రూ.3 వేల పెన్షన్ రూ.5 వేలకు పెంచాలని కోరారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలలో పౌరాణిక జానపద నాటకాలకు అవకాశం కల్పించి కళాకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన అమరావతిలో ఆదివారం భైరాపట్నం భాగ్యమ్మ 10వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి కళాకారులను మెమోంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి నటరాజనాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షులు పొదిలి మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జాస్తి సత్యమూర్తి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు బత్తినేని రామయ్య, చిక్కాల ఉదయ శేఖర్, ఆదినారాయణ, మాదాసు ఆంజనేయులు, గుదే పానయ్య, గుంటూరు రాజు, మాదాసు పేతురు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీనుంచి వైసీపీలోకి మహిళా కార్యకర్తలు

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామ పంచాయతీ శివారు బుగ్గ వాగు చేపల కాలనీకి చెందిన 25 మంది టీడీపీ మహిళా కార్యకర్తలు టీడీపీని వీడి వైసీపీలో చేరారు. ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యులు పిన్నెలి రామకృష్ణారెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ కుటుంబాలకు అండగా ఉంటానని అన్నారు.

18 ఏళ్లుగా జీరో ప్రమాదాలు

విశాలాంధ్ర-రెంటచింతల : 18 ఏళ్లుగా జీరో ప్రమాదాలతో పరాశక్తి సిమెంట్ సంస్థను నిర్వహిస్తున్నట్లు పరాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ జె.ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం ఫ్యాక్టరీ ఆవరణలో 18వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రోజుకు 1500 టన్నుల ఉత్పత్తితో ప్రారంభించి నేడు 4 వేల టన్నులకు అభివృద్ధి చేశామన్నారు. 500 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగాను ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించటం వల్ల జీరో ప్రమాదాలు జరిగాయన్నారు. అనంతరం ఉద్యోగులలో ఉత్సాహం నింపేందుకు క్రికెట్, వాలీబాల్ పోటీలు చిన్నారులకు డ్యాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వార్షికోత్సవాలలో మేనేజరు ఎంఎస్ఎన్ రాజు, చంద్రశేఖర్, మల్లికార్జునరావు, పలు గ్రామాల నేతలు పాల్గొన్నారు.

కొండవీడు కోటకు ఎన్‌సీసీ విద్యార్థులు

విశాలాంధ్ర-యడ్లపాడు : యడ్లపాడు మండలంలోని చారిత్రాత్మక ప్రాంతమైన కొండవీడు కోటలో ఆదివారం ఉదయం ఐదు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థుల బృందాలు సందర్శించాయి. 'ఏక్తా భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, చండీగఢ్, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 600 మంది ఎన్‌సీసీ కేడేట్స్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై 25 ఏపీ బెటాలియన్ నుంచి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్, కమాండింగ్ అధికారి సిద్ధూ, పల్నాడు జిల్లా డీఎఫ్‌వో ఎస్.రామచంద్రరావు, కొండవీడు అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడేట్స్‌కు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రెక్కింగ్‌తో పలు విభాగాల్లో పోటీలను ఏర్పాటు చేశారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గురజాల వారి కోర్టు నందు

E.P. 26/2021 in O.S. 37/2018

బిట్వీన్:

లింగా చెన్నకేశవరావు ...... D.H.R

మరియు

మండలపు సత్యనారాయణ .... J.D.R

To,

మండలపు సత్యనారాయణ తండ్రి రామయ్య, 63 సంవత్సరములు, R/o D.NO : 13-1-41, మాచర్ల టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా.

మీపై డిక్రీ పొంది, డిక్రీ బాకీ వసూలు నిమిత్తం పై నెంబర్ E.P ని D.Hr దాఖలు చేసినందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసులు అందజేయుటకు ఎన్ని మార్లు ఆర్డర్ వేసిననూ మీరు తీసుకోనందున ది. 21-06-2023 వ తేదీ ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలియజేయని ఎడల మీ పరోక్షముందు పై E.P తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేదీ : 21-6-2023.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎన్. శ్యామలాదేవి
D.Hr తరఫున న్యాయవాది
సెల్ నెం : 8096993546.

మహారాజశ్రీ శ్రీయుత గురజాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S NO: 218/2021

Between :

ఆలేటి నాగమణి - వాది

Vs

అనుముల రామచంద్రా రెడ్డి తండ్రి/ నారాయణ రెడ్డి, R/o. నారాయణపురం గ్రామం, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా.

- ప్రతివాది

పై నంబర్ దావాను వాది మీపై ప్రోమిసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేయగా, మీకు ఎన్ని పర్యాయాలును దావా సమనులు పంపినప్పు మీరు గ్రామంలోనే ఉండి, తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ దిగువ పత్రికా ప్రకటన ద్వారా దావా సమనును అందచేయుటకు అనుమతినొస్తూ దావాను ది. 28-06-2023 కి వాయిదా వేసి ఉన్నారు, కావున మీరు సదరు పై వాయిదా తేదీ న స్వయంగా కానీ, వకీలు గారి ద్వారా కానీ వచ్చి శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు లేనిచో మీ పై పరోక్షం గా తీర్మానించెదరు.

వాయిదా తేదీ, : 28-06-2023,

బొరెడ్డి నాగిరెడ్డి,
వాది తరఫు న్యాయవాది, గురజాల,
Cell: 76609 11177, 98499 54148

భూసార పరీక్షలతో సాగు ఖర్చులు తగ్గుతాయి..

విశాలాంధ్ర-అద్దంకి : భూసార పరీక్ష ఫలితాల ద్వారా సాగు ఖర్చులు తగ్గించు కోవచ్చని మండల వ్యవసా యాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని ధర్మవరం గ్రామంలో భూసార పరీక్షల కొరకు మట్టి నమూనాను సేకరించారు. ఈసందర్భంగా ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ మండలంలో మొత్తం 558 మట్టి నమూనా శాంపిల్స్ సేకరిస్తున్నామని రెండు రోజులలో నమూనాలు మొత్తం సేకరించి బాపట్ల మట్టి పరక్షా కేంద్రానికి పంపించి వాటి ఫలితాలను వెంటనే రైతులకు అందించి వాటికి అనుగుణంగా ఎరువుల వాడకం చేపడ్తారన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కోటేశ్వరరావు, వీఏఏ షారోన్ రోజీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని వ్యతిరేకించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఉత్తరాంచల్ రాష్ట్రంలో ముస్లింలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ చీరాల పట్టణంలో దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్.కె.జిలాని మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాద ధోరణితో వ్యవహరిస్తూ ముస్లింలపై దాడులకు తెగబడుతున్నదన్నారు. ఉత్తరాంచల్ రాష్ట్రంలో హిందుమతం వారి స్థలం అనే పేరుతో బ్రిటీషు కాలం నుండి నివాసం ఉంటున్న ముస్లింలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టేందుకు పూనుకుందని ఆరోపించారు. భారతదేశం సర్వమత సమ్మేళనం అని నీతి వాక్యాలు భోధించే బీజేపీకి కులమతాల మధ్య చిచ్చుపెట్టడం మంచిదికాదని హితవు పలికారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో దేశం కోసం ప్రాణాలర్పించిన వారిలో ముస్లింలు కూడా ఉన్నారని, అటువంటి ముస్లిం జాతిపై బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సిగ్గుచేటుగా ఉన్నాయన్నారు. ఇటువంటి అసంబద్ధ విధానాలు అమలుచేస్తున్న బీజేపీని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిలాని, నజీర్, బుజ్జి, ఇమ్రాన్, కరిముల్ల, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా ఉంటా..

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చేనేత నాయ కులకు, కార్మికులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చీరాల నియోజక వర్గ వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ అన్నారు. చీరాల మునిసి పాలిటీ పరిధిలో కోర్టు రోడ్డులో దామర్ల శివ సాంబయ్య డైయింగ్ యూనిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చీరాల మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని చేనేత సామాజిక వర్గ ముఖ్య నాయకులతో కలిసి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్‌ను చేనేత నాయకులు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గుంజారి వెంకటేశ్వర్లు, ఆకురాతి రామ కోటేశ్వరరావు, కూరపాటి నరసింహారావు, కాజా వెంకటేశ్వర్లు, గట్టు చెన్నకేశవులు, గట్టు శ్రీను, అద్దెపల్లి కృష్ణ, జంజనం ఆంజనేయులు, బండారు బాల నాగేశ్వరరావు, పులిమి నాగేశ్వరరావు, ఉప్పల చలపతి, ఆకురాతి వర్మ, గోలి జగదీష్, తోకల అనిల్, గోలి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

యనమదల విద్యార్థికి జేఈఈలో 233వ ర్యాంకు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని యనమదల గ్రామానికి చెందిన పోపూరి అనిరుద్ జేఈఈ మెయిన్స్ లో 233 సాధించాడు. విద్యా ర్థిని మండల విద్యాశాఖాధి కారి పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు అభినందించారు. తండ్రి పోపూరి లక్ష్మీనారాయణ చింతపల్లిపాడు ప్రాథమిక పాఠశాలలో, తల్లి శ్రీలక్ష్మీ సంతమాగులూరు మండలం గురిజేపల్లి ప్రాథమిక పాఠశాలలో టీచ ర్లుగా పనిచేస్తున్నారు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీ డియెట్ పూర్తి చేసిన అనిరుధ్ తెలంగాణ ఎంసెట్లోలో 39వ ర్యాంకు, ఏపీలో 115వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా మండలంలోని ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

మెగా వైద్యశిబిరానికి స్పందన

విశాలాంధ్ర - చీరాల : ముక్కోణం పార్కు సెంటర్ గుంటూరు రమేష్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరానికి చక్కటి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని చీరాల టిడిపి ఇన్‌చార్జి మద్దులూరి మాల కొండయ్య ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో గుండె పరీక్షలతో పాటు బీపి, షుగర్, గ్యాస్ ట్రబుల్ వంటి అనేక పరీక్షలు నిర్వహించారు. గుంటూరు,విజయవాడ రమేష్ వైద్యశాల బ్రాంచ్‌లకు చెందిన ప్రముఖ డాక్టర్లు రోగులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు టీడీపీ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మరియదాసుకు గ్రేస్ పౌండేషన్ చేయూత

విశాలాంధ్ర - వేమూరు : వరహాపురం గ్రామానికి చెందిన యల్లమాటి మరి యదాసు అనారోగ్యంతో బాధపడుతున్నాడని విషయం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత ఖైతేపల్లి శాలెంరాజు ఆర్థిక సాయం అందజేశారు. మరియదాసు పొలంలో ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవ శాత్తు ట్రాక్టర్ బోల్తాపడి కాళ్లు రెండు దెబ్బతిని నడవలేని స్థితిలో గత రెండు సంవత్సరాలుగా మంచానికి పరిమితమవ్వటంతో శాలెంరాజు శనివారం రాత్రి వరహాపురం గ్రామానికి విచ్చేసి బాధితులని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి ఆర్థిక సహాయాన్ని అందించడంతోపాటు నిత్యవసర సరుకులను అందించారు. ప్రతినెల నిత్యవసర సరుకులను తానే ఫౌండేషన్ తరపు నుండి పంపిస్తానని, బాధ్యత కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు యన్నం సురేష్, అనిల్, కూచిపూడి వినయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు తీగలు తగిలి గడ్డిట్రాక్టర్ దగ్ధం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : పట్టణంలోని జమ్ములపాలెం నుంచి పట్టణంలోకి వచ్చే రోడ్డులో ఉన్న రైల్వే వంతెన దగ్గర విద్యుత్తు తీగలు తగిలి గడ్డిలోడుతో వెళుతున్న ట్రాక్టర్ దగ్ధమైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వంతెన వద్ద విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉండటం వలన ట్రాక్టర్ ట్రక్కుపై ఉన్న గడ్డికి తగలటంతో నిప్పురవ్వలు వచ్చి మంటలు వ్యాపించాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ట్రక్కుపై ఉన్న గడ్డి పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక వాహనం వచ్చి మంటల ఆర్పేందుకు యత్నించిన మంటలు అదుపులోకి రాలేదు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- బాధిత కుటుంబానికి సీపీఐ బృందం పరామర్శ
- శాంతిభద్రతలు క్షీణించాయన్న కార్యదర్శి రామకృష్ణ
- 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా,ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్
- 22న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం

మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

విశాలాంధ్ర - చెరుకుపల్లి, రేపల్లె : అక్కను వేదిం చవద్దు అన్న బాలుడిని అత్యంత కిరాతంగా దారిలో అడ్డగించి పెట్రోల్ పోసి నిప్పు పెట్టి అత్యంత కిరాతకంగా హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెంలో రౌడీ మూకల చేతిలో దారుణ హత్యకు గురైన అమర్నాథ్ కుటుంభ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జెల్లి విల్సన్, గుజ్జుల ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్, పార్టీ నేతల బృందంతో కలిసి ఆదివారం పరామర్శించారు. శోఖ సంద్రంలో ఉన్న కుటుంబీలకులతో మాట్లాడి జరిగిన విషయాలను క్షణ్ణంగా అడిగి తెలసుకున్నారు. అమర్నాథ్ చదువులో చలాకీగా ఉండేవాడని తన అక్కలను ప్రాణంగా చూసుకునే వాడని ముగ్గురు కుటుంబాలకు ఒక్కడే మగపిల్లవాడని అల్లారు ముద్దుగా పెంచుకున్నా మని వారు కన్నీటిపర్యంతమయ్యారు. అక్కలను వెంట పెట్టుకుని తీసుకుని వెళ్లేవాడని ఎవరైన ఎదైన అంటున్న అస్సలు ఒప్పుకునే వాడు కాదని నా భర్త చనిపోయిన పెద్దగా మా కుటుంబానికి ఎంతో అండగా ఉండేవాడని అమర్నాథ్ తల్లి భోరున విలపించింది. బాధితులతో రామ కృష్ణ, జల్లి విల్సన్ మాట్లాడుతూ అధైర్యపడోద్దని ధైర్యంగా ఉండాలని నిందితులను కఠినంగా శిక్షించేంత వరకు సీపీఐ తరుపున పూర్తిగా పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలు అదుపు చేయటంలో పోలీస్ శాఖ పూర్తిగా విఫలమైందన్నారు. అన్యం పుణ్యం ఎరుగని బాలుడిని తన అక్కను వేధించవద్దు అన్నందుకే పెట్రోల్ పోసి చంపివేయటం అంటే నీచమైన దుర్మార్గమైన ఘటన దశాబ్దకాలంలో ఎక్కడ జరగలేదన్నారు. అధికార మదం తో, కామంతో కళ్ళు నెత్తికి ఎక్కి దున్నపోతుల మాదిరి చెలరేగిన రౌడీ మూక నీచమైన దారుణ ఘటనకు పాల్పడటం బాధాకరమన్నారు. బాలుడిని హత్య చేస్తే ఆ కుటుంబాన్ని హోంమంత్రి ఇంతవరకు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. సమాజంలో ప్రజలకు

ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణ, విల్సన్, ఈశ్వరయ్య, అజయ్, సింగరకొండ

పోలీసులు అంటే భయం లేదు, చట్టాలను గౌరవించే పరిస్థితి లేదని, నైతికంగా పోలీస్ వ్యవస్థ పూర్తిగా తన ఉనికిని కోల్పోయిందని ఆరోపించారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ బాలుడి హత్య కేసును ప్రక్క దారి పట్టించేందుకు ప్రయత్నం చేయటం దారుణం అన్నారు. నిందితులకు శిక్ష పడే వరకు, భాదితులకు అండగా ఉంటామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అధికార పార్టీ దుర్మార్గాలు, దౌర్జన్యాలపై ఈ నెల 22న విజయవాడలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు అన్ని రాజకీయ పార్టీలను కలుపు కుని కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ట్ కోర్టులను ఏర్పాటు చేసి సత్వరం నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమర్నాధ్ కుటుం బానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ప్రభుత్వం ఉద్యోగం కల్పించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అమర్నాధ్‌ను పెట్రోల్ పోసి తగలపెట్టిన ప్రదేశాన్ని సీపీఐ బృందం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మీక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ గీత పనివార సంఘం రాష్ట్ర నాయకులు కంచర్ల కాశయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు కోట మాల్యాద్రి, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు జంగాల చైతన్య,సిపిఐ నాయకులు గొట్టిముక్కల బాలాజీ ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ముండ్ల జాన్, దోమ రాజారెడ్డి, గౌడ సంఘం జిల్లా నాయకులు పీటా సుబ్బరామయ్య, గౌడ సంఘం నాయకులు ఉప్పాల నాగేశ్వరరావు, ఆటో యూనియన్ జిల్లా నాయకులు షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ.. జనం విలవిల..!

విశాలాంధ్ర -పిట్టలవానిపాలెం : నిప్పుల కొలి మిగా ఎండలు మండిపోతున్నాయి... మాడులు మలమల మాడుతున్నాయి.. జూన్ నెలలో సగం రోజులు పూర్తయినా భానుడి భగభగలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఉదయం 8 గంటలకే ఎండలు ఆరంభమై సాయంత్రం 6 గంటల వరకు తీవ్రంగా వడగాల్పులు కొడుతున్నాయి. ఎండా కాలంలో ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరి, ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా సమోదవుతున్నాయి. రోజు రోజుకు క్రమంగా ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీలు వరకు పెరుగుతున్నాయి.

ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి

ఎండ వేడిమితో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. బయటకు రావాలంటే ఎండ.. ఇంట్లో ఉంటే ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయికి చేరుకోవడంతో ఫ్యాన్లు, కూలర్లు కూడా సరిపోవడం లేదు. ఫ్యాన్లు వేసిన వడగాలి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే బయటకు వచ్చిన సమయాల్లో కూడ ఎండ నుంచి రక్షణ పొందేందుకు గొడుగులు, టవళ్లు, టోపీలను ఆశ్రయిస్తున్నారు. మరో పక్క దాహార్తిని తీర్చుకోవడానికి శీతలపానీయాలు చెరుకు రసం, లస్సీ, జ్యూస్ లాంటివి సేవిస్తున్నారు. పెరుగుతున్న వడగాలులు, వడదెబ్బకు గురికాకుండా వేసవి తాపం నుంచి రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు రావాలని ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్ల వద్దని చెబుతున్నారు.

జనం లేక నిర్మానుష్యంగా రోడ్లు

మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం మెయిన్ సెంటర్, చందోలు మెయిన్ సెంటర్, రెడ్డిపాలెం మెయిన్ సెంటర్ లలో జనసంచారం లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు పై దాటి పోవడంతో మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఎండలకు తోడు వడగాలులు కూడా వీస్తోండటంతో జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. హైవే, ప్రధాన రోడ్లతో సహ అన్ని రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపే ప్రజలు తమ పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. పాఠశాలల ఒంటిపూట బదులు మధ్యాహ్నం 12.30 గంటకే ముగియడంతో విద్యార్థులు కూడా ఆ సమయంలోపు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఆపై ఏమైనా పనులు ఉంటే సాయంత్రం 6 గంటల తర్వాతే బయటకు వస్తున్నారు. మరి కొన్ని రోజులు ఎండలు ఇలాగే ఉండే అవకాశం ఉందని ప్రజలు అనుకుంటున్నారు.

అమర్‌నాథ్‌ది ప్రభుత్వ హత్యే

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ

విశాలాంధ్ర - బాపట్ల : భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్న దేశంలో ఇంకా కుల వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా విద్యార్థుల మధ్య కూడా కుల వివక్షతను పెంచే విధంగా వ్యవహరిస్తుందని ఆల్ ఇండియా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ అన్నారు. చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెంలో హత్యకు గురైన 10వ తరగతి విద్యార్థి ఉప్పాల అమర్‌నాథ్ కుటుంబీకులను ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నాసర్‌జీ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల మధ్య కూడా కుల వివక్షతను పెట్టి ముక్కు పచ్చలారని 15 ఏళ్ల విద్యార్థి అమర్‌నాథ్‌ను కేవలం కుల అహంకారంతోనే కనీసం కనికరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని నిందితుడి సామాజిక వర్గం ఆయన వెంట ఉందని ఏ మాత్రం భయం లేకుండా పెట్రోల్ పోసి తగలబెట్టడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనను ఏఐఎస్ఎఫ్ ఖండిస్తుందని ఎక్స్‌గ్రేషియా ఉద్యోగాలు కంటే తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించేంత వరకు పోరాటం చేస్తామని 22వ తేదీని విజయవాడలో అన్నీ పార్టీలు, సంఘాలతో జరిగే ఏఐఎస్ఎఫ్ పాల్గొంటుందని అన్నీ విద్యార్థి సంఘాలు పాల్గొని నిందితులకు శిక్ష పడే వరకు పోరడదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్, కిరణ్, ఏశ్వంత్, శ్రీను,ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు దొమా రాజారెడ్డి, జంగాల చైతన్య, చల్లా మరియాదాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ ఆత్మకు శాంతి చేకూరాలి

- టీడీపీ క్యాండిల్ ర్యాలీ

విశాలాంధ్ర - బాపట్ల : గంజాయి మత్తులో ఉన్న వైసీపీ సైకోల చేతిలో బలిదానమైన పదో తరగతి విధ్యార్థి ఉప్పాల అమర్‌నాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. వైసీపీ కార్యకర్త వెంకటేశ్వర రెడ్డి చేతిలో అన్యాయంగా హత్య చేయబడ్డ విద్యార్థి అమర్నాధ్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలంటూ పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన క్రోవోతుల ర్యాలీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు ఆరాచకాలు, దౌర్జన్యాలు, దందాలు పెరిగిపోయాయన్నారు. అక్కను వేదించోద్దు అని ప్రశ్నించిన బాలుడిని కిరాతంగా హత్య చేసిన వైసీపీ గంజాయ్ బ్యాచ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షిణించి పోయాయి. దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. గంజాయి రవాణాతో యువత ను మత్తులో ముంచి నేరాలకు ఊసుగొల్పుతున్నారన్నారు. తన అక్కను వేధింపులకు గురి చేస్తున్నారని ప్రశ్నిస్తే వైసీపీ కార్యకర్త వెంకటేశ్వర రెడ్డి అమర్నాధ్ గౌడ్ అనే విద్యార్థిని హత్య చేయడం దారుణమన్నారు. వైసీపీ నాయకులు రాజీ కోసం వచ్చి ఆ విద్యార్థి చావుకు లక్ష రూపాయల విలువ కట్టి కేస్ నీరుగార్చలని చూస్తున్నారన్నారు.

వైసీపీ పాలనలో మైనార్టీలకు రక్షణ లేదు : ఎమ్మెల్యే గొట్టిపాటి

విశాలాంధ్ర-అద్దంకి : గంజాయి మత్తులో వైసీపీ సైకోల వలన రాష్ట్రంలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ టీడీపీ మేనిఫెస్టోపై మండలంలోని చెరువుకొమ్ముపాలెం, జార్లపాలెం, మణికేశ్వరం, కొంగపాడు, వేలమూరిపాడు, బొమ్మనంపాడు, విప్పర్లవారి పాలెం గ్రామాల టీడీపీ నేతలతో విస్తృత స్థాయి సమావేశం స్థానిక కామేపల్లి కళ్యాణ మండపం నందు ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్ళి కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. బాపట్ల జిల్లాలో రాజోలులో గౌడ సామాజిక వర్గానికి చెందిన బీసీ పిల్లవాడు తన అక్కను ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు వైసీపీ కార్యకర్త పదవ తరగతి చదువుతున్న అమర్నాద్ గౌడ్ అనే చిన్న పిల్లవాడిని పెట్రోల్ పోసి నిప్పుపెట్టి కాల్చి చంపడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో ఇదే నిదర్శనమన్నారు. జగన్‌రెడ్డి పాలనలో గంజాయి మత్తులో యువత నాశనం అవుతుందని, రాష్ట్రంలో బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రెండు రోజుల క్రితం విశాఖలో ఎంపి కుటుంబ సభ్యులనే కిడ్నాప్ చేశారంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్ధం చేసుకోవచ్చన్నారు. దళిత ఓట్లతో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి అదే దళితులపై దమనకాండ చేస్తున్నాడన్నారు.

యువత పెడదోవ పట్టకుండా చర్యలు తీసుకోవాలి

- మంత్రి, ఎంపీకి బీసీ నేత రవికుమార్ విజ్ఞప్తి

విశాలాంధ్ర - బాపట్ల : కక్ష కారపణ్యాలకు ప్రేరేపించే విధంగా పెడదారిపడుతున్న యువతను సరైన దారిలో నిలిపే విధముగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీ మోపిదేవి వెంకటరమణ, రాష్ట్ర మంత్రి జోగి రమేష్‌లకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఉప్పాలవారి గ్రామానికి చెందిన విద్యార్థి ఉప్పాల అమర్ నాథ్ మృతిపై సంతాపం తెలిపి, ప్రభుత్వం అందిస్తానన్న రూ. పది లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందజేయడానికి ఆదివారం గ్రామానికి వచ్చిన వారికి పలు విజ్ఞాపనలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జిల్లా అధ్యక్షుడు జువ్వా శివరాం ప్రసాద్ ఆదేశాల మేరకు వారిని కలిసిన ఆయన మాట్లాడుతూ బాలికలు రాజోలు పంచాయతీ కేంద్రంలోని పాఠశాలకు ఆ గ్రామం మీదుగా వెళ్లడానికి చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. అల్లరి మూకల ఆకతాయి చేష్టలకు వారు పాఠశాలకు వెళ్లేందుకే విముఖత చూపటం లేదని, ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం ఇస్తానన్న రూ. 10 లక్షలుతో సరిపెట్టక పేదలైన బాధిత కుటుంబానికి రూ. ఒక కోటి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అమర్నాథ్ కుటుంబానికి రూ.10 లక్షలు ప్రభుత్వ సాయం

కుటుంభంలో ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి నిర్మాణం

విశాలాంధ్ర - రేపల్లె : బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పాలవారి పాలెంలో పదో తరగతి బాలుడి సజీవ దహనం అత్యంత దారుణమని ఎంపీ మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌తో కలిసి ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఉద్యోగ భద్రతతో పాటు, ఇంటి స్థలం కొరకు పట్టాను అందజేసినట్లు చెప్పారు. వారు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునే విధంగా పదవ తరగతి చదువుతున్న అమర్నాథ్ ను హత్య చెయ్యటం బాధాకరం అన్నారు. హత్య జరిగిన కొన్ని గంటలలోనే నిందితులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. రెండు కుటుంబాలకు వ్యక్తి గత కారణాలతో జరిగిన హత్య కేసుని తెలుగుదేశం పార్టీ నాయకులు కులాలకు, రాజకీయ అపాదించటం సిగ్గుచేటన్నారు. బాధిత కుటుంభ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇవ్వాలి కానీ వారిని రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకురావడం టీడీపీ నీచ రాజకీయాలకు నిదర్శమని మండిపడ్డారు. ఈ ఘటనకు ఎలాంటి రాజకీయం, కుల నేపథ్యం లేకపోయినప్పటికీ. టీడీపీ నాయకులు, కులాలను అపాదించి రాజకీయాలు చేస్తున్నరని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో అల్లర్లు చేయడం టిడిపికి వెన్నతో పెట్టిన విద్య అని మండి పడ్డారు. పల్లెల్లో ఉన్న వాతావరణాన్ని కలుషితం చెయ్యటం కులాల మధ్య చిచ్చుపెట్టటం టీడీపి నైజం అన్నారు. రాజకీయాలలో నైతిక విలువలు కలిగి ఉంటేనే ప్రజల విశ్వాసం ఉంటుందని చెప్పారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం

అమర్నాథ్ అక్కను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర - బాపట్ల : మీ వేదన మీ బాధ మమ్మును కలిచి వేస్తుంది... దర్మార్గమైన ఘటన జరగటం చాలా బాధాకరంగా ఉంది.. అధైర్య పడోద్దు.. సీపీఐ అండగా ఉంటుంది.. ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించేంత వరకు అండగా ఉండి పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ అమర్నాధ్ కుటుంబీకులకు భరోసా ఇచ్చారు. చేతికి అందివచ్చి కుటుంబంలో అండగా ఉంటున్న కుమారున్ని అల్లరిమూకల దుశ్చర్యలో కోల్పోవటం ఎంతో బాధగా ఉందన్నారు. ఘటనకు పాల్పడిన నిందితులు ఎవరైన సరే కఠినంగా శిక్షపడిలే పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు. సీపీఐ మీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అన్నీ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ప్రభుత్వం తరుపున న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ధైర్యంగా ఉండాలని విల్సన్ సూచించారు. ఆయనతో పాటు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ,సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్, రేపల్లె నియోజకవర్గ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ తదితరులున్నారు.

ఎల్ఐసీ బోనస్ పేరుతో సైబర్ మోసాలు

- ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : సైబర్ నేరగాళు ప్రజలను మోసం చేయడానికి రోజురోజుకు కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొందరు సైబర్ నేరగాళు తెలియని మొబైల్ నంబర్స్ నుండి మీరు ఎల్ఐసి కంపెనీ అందించే అదనపు బోనస్‌కు ఎంపిక అయ్యారని డబ్బులను తీసుకునేందుకు కింద లింక్ క్లిక్ చేయండి అని సందేశాలు పంపుతున్నారన్నారు. అటువంటి మెసేజ్‌లో ఉన్న లింక్‌ని క్లిక్ చేసి మీ వ్యక్తిగత సమాచారం బ్యాంకు ఖాతా నంబర్లు, పాస్‌వార్డులు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్లు వాటి సహాయంతో మీ బ్యాంకు ఖాతాలోని సొమ్మును తెలియకుండానే దొంగిలిస్తున్నారన్నారు. తెలియని మొబైల్ నెంబర్‌ల నుండి వచ్చే లింక్‌లను ఎట్టిపరిస్థితులలో క్లిక్ చెయ్యవద్దని సూచించారు. ఎవరితోనూ మీ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు.అలాగే గూగుల్ నోటిఫికేషన్ ద్వారా వచ్చే క్యాష్ రివార్డులు, స్క్రాచ్ కార్డ్‌లని నమ్మవద్దన్నారు. డబ్బులు ఎవ్వరూ ఊరికే ఇవ్వరని, ఎల్ఐసి మీకు ఎటువంటి లింక్‌లను పంపదని తెలిపారు. సైబర్ నేరానికి గురైన తరువాత బాధపడేకంటే ముందు నుంచి ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తం ఉండాలనే ఉద్దేశంతో మోసాల గురించి హెచ్చరి స్తున్నామన్నారు. ఎవరైనా ఇటువంటి సైబర్ మోసానికి గురైనట్లయితే మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని సూచించారు. హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చేయోచ్చని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

బత్తుల జయరావు మృతి సీపీఐకి తీరని లోటు.

విశాలాంధ్ర - చీరాల : నిబద్ధత కలిగిన నాయకులు బత్తుల జయరావు అని ఆయన్ను కోల్పోవడం భారత కమ్యూనిస్టు పార్టీ కి తీరని లోటని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు బత్తుల జయరావు మృతి చెందగా నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ కామ్రేడ్ బత్తుల జయరావు చీరాల ఐయల్‌టిడి యూనియన్‌లోను సిపిఐ సభ్యులుగా అనేక ఉద్యమాలలో పాల్గొని పార్టీకి ఎఐటియుసి యూనియన్‌కు ఎనలేని క్రుషి చేసిన నిజాయుతీ పరుడని అన్నారు.కమ్యూనిస్టు పార్టీ చేసిన ఎన్నో పోరాటాల్లో ఆయన వంతు కృషి చేశారని అటువంటి పోరాట పటిమ గలిగిన వ్యక్తి ని నేడు కోల్పోవడం భారత కమ్యూనిస్టు పార్టీకి,ఎఐటియుసికి తీరని లోటని అన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్న బీజేపీ

విశాలాంధ్ర - బల్లికురవ : రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి రానున్న ఎన్నికలలో ప్రజలంతా భారతీయ జనతా పార్టీకి అండగా నిలవాలని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రావిపాటి కాశిదేవి కోరారు. ఆదివారం మండల పరిధిలోని గుంటుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామీణ జాతీయ ఉపాధి హామీ కూలీలతో కేంద్రంలోని బిజెపి పార్టీ 9 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 9 ఏళ్ల పరిపాలనలో కేంద్రంలోనూ, ఆంధ్ర రాష్ట్రాల్లో పేద బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలవుతున్న ఉపాధి హామీ నిధులు కూలీల రోజువారి వేతనాలు తదితర అంశాలపై వారితో చర్చించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన పుస్తకాలను వారికి పంపిణీ చేశారు. అనంతరం వన్ క్రోర్ సెల్ఫీ విత్ మహిళలాబత్తి కార్యక్రమంలో భాగంగా మహిళ కూలీలతో సెల్ఫీ దిగారు.ఈ కార్యక్రమంలో మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లినేని వెంకట నారాయణమ్మ బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.